క్లుప్తంగా

వైభవంగా అంకాళమ్మ ఉత్సవాలు



వరికుంటపాడు: మండలంలోని జడదేవిలో పిల్లాపేరు వాగు సమీపంలో కొలువైన అంకాళమ్మ ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కుందూరు వంశీయుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి అమ్మవారికి విశేష పూజలు, అలంకారం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యే పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

అక్రమంగా కలప తరలింపు



వరికుంటపాడు: మండలంలోని జడదేవిలో సర్వే నంబర్ 98లో ఉన్న కొండ పోరంబోకులోని నల్లతుమ్మ చెట్లను కలప కోసం కొందరు అక్రమార్కులు నరికివేస్తున్నారు. బొగ్గు బట్టీలకు కలపను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో కొండ పోరంబోకును మైనింగ్‌కు కేటాయించేందుకు ప్రభుత్వం ప్రయత్నించగా గ్రామస్తులు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కలప తరలింపును అడ్డుకుని చెట్లను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నదానం



కావలి: స్థానిక బుడంగుంట కాలనీలోని పేదలకు ఆదివారం అన్నదానం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులుగా పనిచేస్తున్న కర్నాటి రోహిత్, నాగభార్గవి దంపతులు తమ కుమార్తె అనురాధ వాసు పుట్టినరోజును పురస్కరించుకుని వంద మందికి అన్నదానం చేశారు.


బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కావలి: దీపావళి బాణసంచా విక్రయించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కావలి రెండో పట్టణ సీఐ కే శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు పొందిన వారు అధికారులు సూచించిన నిర్దిష్ట ప్రదేశాల్లోనే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దుకాణాల మధ్యన నిర్దిష్ట దూరం ఉండాలన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్నిమాపక సిలిండర్లు, రెండు ఇసుక బకెట్లు, నీరు అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతుల్లేకుండా ఎవరైనా బాణసంచా తయారు చేసినా, నిల్వ చేసినా, అమ్మకాలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి

ఉదయగిరి: జిల్లాలో అన్ని రంగాల్లో వెనుకబడిన ఉదయగిరి కేంద్రంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని మండలాలను కలుపుతూ ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని ఉదయగిరి జిల్లా సాధన సమితి నాయకులు కోరారు. ఆదివారం వారు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని 21 మండలాలను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తే వెనుకబడిన ప్రాంతాలు అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. నాయకులు వేణుగోపాల్, ఎండీ ఖాజా, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ధర్మప్రచారం



కలిగిరి: మండలంలోని నాగిరెడ్డిపాళెం, పీర్లకొల్లు గ్రామాల్లో ప్రకృతి వ్యాలీ వ్యవస్థాపకుడు, మహాకరుణ యాగం నిర్వాహకులు దాట్లరాయి జగపతిరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ ధర్మప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి శాకాహారం విశిష్టత, ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ మాంసాహారాన్ని మానేసి కరుణామయులుగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. పిరమిడ్ ధ్యాన మాస్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోగిన నగారా

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

- ప్రారంభమైన ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియ
- నవంబరు 20, 21, 22 తేదీల్లో ఎన్నికలు



ఆత్మకూరులోని ఇరిగేషన్ శాఖ ఈఈ కార్యాలయం

ఆత్మకూరు: సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. సాగునీటికి సంబంధించిన సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో సంబంధిత అధికారులు కసరత్తును ప్రారంభించారు. కలెక్టర్ నోటిఫికేషన్‌ను ప్రకటించడంతో అధికారులు ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను ప్రారంభించారు. సాగునీటి సంఘాలను ఎంత మేర విస్తీర్ణానికి పరిమితం చేయాలో నిర్ధారించే పనిని ఇరిగేషన్ శాఖ చేపట్టింది. ఆయకట్టు వారీగా విస్తీర్ణం గుర్తింపు ప్రక్రియ ఈ నెల 22 నుంచి ప్రారంభమైంది. ఈ నెల 30 వరకు ప్రక్రియ కొనసాగనున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

95 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ఆత్మకూరు ఇరిగేషన్ శాఖ డివిజన్ పరిధిలో 95 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 61, ఉదయగిరి నియోజకవర్గంలో 34 ఉన్నాయి. విస్తీర్ణం వారీగా ఓటర్లను గుర్తించేందుకు రెవెన్యూ శాఖతో కలిపి ఇరిగేషన్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో సర్వే నంబర్ల వారీగా ఉన్న వివరాలను ప్రాతిపదికగా తీసుకుని ఓటర్ల గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నారు. ఓటర్ల జాబితాను రెవెన్యూ శాఖ అధికారులు సిద్ధం చేయనున్నారు. నెలాఖరు నాటికి ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను ఇరిగేషన్ శాఖ ఈఈ ప్రకటించనున్నట్లు సమాచారం.

ఓటర్ల ముసాయిదా తయారీ ఇలా...

సాగునీటి సంఘం ఎన్నికల్లో ఆయకట్టు భూముల్లో సాగుచేసే రైతులే ఓటర్లుగా ఉంటారు. భూ యజమానుల జాబితాలను, నీటిని వినియోగిస్తున్న వారి పూర్తి వివరాలను క్రోడీకరించుకుని ఓటర్ల జాబితాలు ప్రకటించనున్నారు. నవంబరు 6 నుంచి 10వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. సిద్ధమైన ఓటర్ల జాబితాలను ఆయా మండల కార్యాలయాలు, పంచాయతీ కేంద్రాల్లో ప్రకటించనున్నారు. నవంబరు 11, 12 తేదీల్లో అభ్యంతరాలకు అవకాశం కల్పిస్తారు. 13న ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా జాబితాలను ప్రకటించనున్నారు.


నవంబరు 20 నుంచి ఎన్నికలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పూర్తయిన తరువాత నవంబరు 20 నుంచి 22 వరకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయం చేసుకుని పోలీసుల సహకారంతో పకడ్బందీగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

మండలం	సాగునీటి సంఘాలు
ఆత్మకూరు	8
చేజర్ల	10
ఏఎస్‌పేట	14
అనంతసాగరం	10
మర్రిపాడు	18
సంగం	1
మొత్తం	61



గ్రామాల్లో ఎన్నికల సందడి



నక్కలగండి రిజర్వాయర్

వరికుంటపాడు: మండలంలోని గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి మొదలైంది. మండలంలో ప్రధానంగా నక్కలగండి రిజర్వాయర్‌తో పాటు విరువూరు, ఇస్కపల్లె, రామదేవులపాడు, చిన్నకనియంపాడు, కొండాయపాళెం, గువ్వాడి, తోటలచెరువుపల్లె, పామూరుపల్లి, గణేశ్వరాపురం, కొండారెడ్డిపల్లి చెరువులకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి చెరువుకు సంబంధించి ఆరు టీసీలకు ఎన్నికలు జరుగుతాయి. వారిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు ఇరిగేషన్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే ఎన్నికలు జరగనున్న చెరువుల పరిధిలోని రైతుల వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలన నిమిత్తం అందజేశారు. ఓటర్ల జాబితాల తయారీలో నిమగ్నమయ్యారు. నక్కలగండి రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల పరిధిలో 1,200 ఎకరాలు ఆయకట్టు ఉంది. కుడి కాలువ కింద వరికుంటపాడు మండలంలోని వేంపాడు, రామాపురం, తిమ్మారెడ్డిపల్లె పంచాయతీల పరిధిలో 1000 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఎడమ కాలువ కింద ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని కోడిగుడ్లపాడు, జంగాలపల్లె గ్రామాల పరిధిలో 200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ దఫా ప్రాజెక్టు ఎన్నికలు రసవత్తరంగా ఉండనున్నాయి. ప్రాజెక్టు అధ్యక్ష పదవి కోసం రాజకీయ యోధులు పోటీ పడనున్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్ట్ అధ్యక్ష పదవిని తమ వర్గీయులకే దక్కించుకునేందుకు ఇటు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, అటు కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పావులు కదుపుతూ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో సాగునీటి ఎన్నికలపై ప్రతిఒక్కరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

మహిళలపై గృహహింస దురదృష్టకరం

కావలి: మహిళా సంఘాలు పోరాటాలు సాగించి సాధించుకున్న గృహహింస నిరోధక చట్టం 2005 అక్టోబర్ 26న అమల్లోకి వచ్చిందని, 20 ఏళ్ల గడిచినా మహిళలపై గృహహింస ఆగకపోవడం దురదృష్టకరమని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సీ శారద, కార్యవర్గసభ్యులు షేక్ నూర్జహాన్, టీ సుజాత, షేక్ ఫాతిమా, అరుణ తదితరులు ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వరకట్న వ్యతిరేక చట్టం 1960లో వచ్చిందన్నారు. దాని వల్ల బాధితులకు న్యాయం జరగకపోగా, విచారణలో నిందితులు అని తేలిన వ్యక్తులు జైలు శిక్షకు గురైతే బాధిత మహిళలు పుట్టినింట్లో భారంగా తయారై బిడ్డలను పోషించే శక్తి లేక ఇబ్బందులు పడడం గమనించిన మహిళాసంఘాలు పోరాడి గృహహింస నిరోధక చట్టం-2005ను సాధించాయని గుర్తుచేశారు. కానీ దీనికి నియమించిన రక్షణాధికారులు ఎవరో, ఎవరిని ఆశ్రయించాలో, చట్టం వలన కలిగే ఉపశమనాలు ఏమిటో తెలియక బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇది సివిల్ చట్టం అని, వరకట్న వేధింపుల చట్టంలోని 498/ఏ సెక్షన్ ప్రకారం నిందితునికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేస్తుండడంతో వారికి భయం లేకుండాపోయిందన్నారు. మళ్లీ అదే హింసకు పాల్పడుతున్నారన్నారు. బాధితులైన భార్య, పిల్లలకు ఏ మాత్రం ఉపశమనం లేక వీధిన పడుతున్నారని చెప్పారు. వరకట్న వేధింపుల చట్టాన్ని కొందరు మహిళలు దుర్వినియోగం చేయడం వలన 498/ఏ సెక్షన్ ప్రకారం అరెస్ట్ అయినవారికి స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని గుర్తుచేశారు. గృహహింస బాధిత మహిళలు నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న 'సఖి' ఆఫీసులో ఉండే రక్షణాధికారిణికి అర్జీ ఇవ్వాలని సూచించారు. కావలి ఆర్డీఓ కూడా రక్షణాధికారే అని, వారికి కూడా తాముపడిన హింసలు గురించి తెలుపుతూ అర్జీ అందజేయవచ్చని వివరించారు. విడాకులు, క్రిమినల్ కేసులతో సంబంధం లేకుండా రక్షణ కల్పించేలా న్యాయం చేస్తారని తెలిపారు. గృహ హింసపై చట్టంపై రక్షణాధికారులు విస్తృతంగా సదస్సులను ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ముందర పొట్టెమ్మ పల్లకిసేవ



కావలి: మండలంలోని అన్నగారిపాళెంలో ముందర పొట్టెమ్మ, గంగమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండోరోజు ఆదివారం ఉదయం గంగపెట్టె ఊరేగింపు, బొల్లి ఆవుల వీరంగ ప్రదర్శనలు నేత్రపర్వంగా జరిగాయి. తొలుత అమ్మవార్లకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహాప్రత్యంగిల, సర్వగ్రామదేవతా, సుదర్శన, నవగ్రహ, దుర్గాసూక్త, లక్ష్మీగణపతి, రుద్ర దశ మహావిద్యా, మానసాదేవి, రాజశ్యామలదేవి, తదితర హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. రాత్రి ముందర పొట్టెమ్మకు పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు.

మంద కృష్ణమాదిగ సభ జయప్రదానికి పిలుపు



వింజమూరు(ఉదయగిరి): నెల్లూరులో నవంబర్ 3న జరిగే మంద కృష్ణమాదిగ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్‌మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక బంగ్లా సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్‌కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో ఆమోదం కోసం తీర్మానం పంపి ఉన్నట్లు చెప్పారు. ఈ విషయమై అవగాహన కల్పించే నిమిత్తం మంద కృష్ణమాదిగ అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలోని మాదిగలు పెద్దసంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

వింజమూరు (ఉదయగిరి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో వింజమూరులో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. దీపావళి జ్ఞానజ్యోతి వెలుగులు ప్రతి ఇంట్లో నిండాలని ఆకాంక్షిస్తూ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి దేవతమహల్ సెంటర్ వరకు ప్రచారం సాగించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత బోధకులు పెంచలరత్నం, మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ప్రారంభం

కావలి: పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు.విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు.

నేడు జాబ్‌మేళా

సోమశిల: అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాసమస్యల పరిష్కారవేదికతో పాటు జాబ్‌మేళాను సోమవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాకు ఐటీఐ, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఫార్మా, రిటైల్, మేనేజ్‌మెంట్ ఎంఎఫ్‌సీజీ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మెప్మా అర్బన్ మార్కెట్

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను సోమవారం నిర్వహించనున్నట్లు మెప్మా టీఎంసీ జీ మాధవి ఆదివారం తెలిపారు. పొదుపు మహిళల ఉత్పత్తులతో పాటు వినియోగదారులకు అవసరమైన నాణ్యమైన వస్తువులను అర్బన్ మార్కెట్లో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ప్రతి నెలా రెండు రోజుల పాటు నిర్వహించే మెప్మా అర్బన్ మార్కెట్‌ను పట్టణ ప్రజలు ప్రోత్సహించి మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ విగ్రహ ప్రతిష్ట

కావలి: మండలంలోని చలంచర్ల పంచాయతీ పరిధిలోని పెద్దారం గిరిజన కాలనీలో అంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోడిపందేలపై పోలీసుల దాడులు

ఆత్మకూరు: కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆత్మకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై ఎస్‌కే జిలానీ కథనం మేరకు.. ఆత్మకూరు మండలం పడకండ్ల పొలాల్లో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. రెండు కోళ్లతో పాటు రూ.1,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకటో తరగతి నుంచే అపార్ నమోదు



సీతారామపురం: కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం తీసుకొచ్చిన జీవితకాల ప్రత్యేక పన్నెండు అంకెల గుర్తింపు వ్యవస్థ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఇకపై ఒకటో తరగతి నుంచి తప్పనిసరి చేస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అపార్ గుర్తింపు సంఖ్య నమోదుకు ఆధార్ కార్డు కీలకం. పాఠశాలల్లో నమోదైన, ఆధార్ వివరాలకు సరిపోలని పక్షంలో వాస్తవమైన వివరాలను నవీకరించుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆధార్ వివరాల్లో మార్పులు అవసరమైతే ఆ మేరకు ఆయా కేంద్రాల్లో సరి చేయించుకునే వెసులుబాటు ఉంది. పాఠశాల వివరాల్లో మార్పులకు సంబంధిత అధికారులను సంప్రదించాలి. ఇప్పటికే 9,10 తరగతుల విద్యార్థులకు అపార్ గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు రోజుకు కనీసం 500 మందికి అపార్ గుర్తింపు సంఖ్యలను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాలో 2,040 ప్రాథమిక పాఠశాలల్లో 65,109 మంది, 220 ప్రాథమికోన్నత పాఠశాలలో 20,820 మంది, 336 ఉన్నత పాఠశాలలో 1,03,150 మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ విడతల వారీగా అపార్ నమోదు చేయనున్నారు.

సుందరకాండ పారాయణంతో సకలశుభాలు



సుందరకాండ విశిష్టతను వివరిస్తున్న నరసింహారెడ్డి

ఆత్మకూరు: పట్టణానికి చెందిన తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే మంచిమాట కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. సుందరకాండ-మానవ జీవితంపై ప్రభావం అన్న అంశంపై సమితి సభ్యుడు అచ్చోలు నారసింహారెడ్డి ప్రసంగించారు. సుందరకాండ పారాయణంతో మానవుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పవిత్రమైన సుందరకాండలో ప్రతి పదం, ప్రతి శ్లోకం మంత్రబద్ధమై ఉంటుందని భక్తితో నిత్య పారాయణం చేస్తే సకల శుభాలు చేకూరుతాయని వివరించారు. సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, ప్రధానకార్యదర్శి, కవి అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, విశిష్ట అతిథి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంచి పరమేశ్వరరెడ్డి, ఏ గోవిందరెడ్డి, ఎస్‌వీ రమణయ్య, వీ నారాయణరావు, కేవీ శేషారెడ్డి, టీవీ సుబ్బయ్య, కే రవీంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పగలు వెలుగులు..రాత్రి వేళల్లో కోతలు



జీకేఅగ్రహారం బీసీ కాలనీలో పగటిపూట వెలుగుతున్న వీధి దీపం

జలదంకి: మండలంలోని పలు పంచాయతీల్లో వీధి దీపాలు రేయింబవళ్లు వెలుగుతున్నాయి. ఈ కారణంగా ఓ వైపు పంచాయతీలపై విద్యుత్ బిల్లుల భారం పడుతుండగా, మరోవైపు విద్యుత్ వృథా అవుతోంది. విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. బ్రాహ్మణక్రాక, రామవరప్పాడు, జలదంకి, జమ్మలపాళెం, ఎల్ఆర్‌అగ్రహారం, చోడవరం, తదితర పంచాయతీల్లో పగలు వీధిదీపాలు వెలుగుతున్నా పట్టించుకునేనాథుడే లేడు. పగటి వేళల్లో స్పందించని విద్యుత్ అధికారులు రాత్రి వేళల్లో మాత్రం ఇష్టానుసారంగా కోతలు విధిస్తూ ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నారు. పగటి వేళల్లో వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు విద్యుత్, పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగటి వెలుగులను ఆపి రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ పావని

సోమశిల: అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని కోరారు. ఆదివారం ఆమె అధికారులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారవేదికకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రితో పాటు కలెక్టర్ ఆనంద్ పాల్గొంటారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో హాజరుకావాలన్నారు. ప్రతి శాఖకు ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయనున్నట్లు చెప్పారు. సభా ప్రాంగణం వద్ద ప్రజలకు ఎటువంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాసమస్యల పరిషారమే లక్ష్యంగా మంత్రి ఆనం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట ఆత్మకూరు సీఐ గంగాధర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

డీఆర్ గొప్ప మానవతావాది



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న దాతలు

కావలి: దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) గొప్పమానవతావాది, ఆయన సమాజానికి అందించిన సేవలు అమూల్యమని డాక్టర్ అల్లం శ్రీనివాసులు పేర్కొన్నారు. డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో 60 మంది నిరుపేద వృద్ధులకు ఆదివారం నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ చేశారు. వెంగళరావునగర్‌లోని సేవా సమితి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ అల్లం శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డీఆర్ బాటలోనే ఆయన కుమారులు వినయకుమార్‌రెడ్డి, విద్యాధరకుమార్‌రెడ్డి విశ్వోదయ విద్యాసంస్థల ద్వారా విద్యాదానం, సమాజ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం అభినందనీయమన్నారు. సేవా సమితి తరుపున వృద్ధులకు తాను ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని ప్రకటించారు. విశ్వోదయ రెక్టార్ దొడ్లవినయ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, సేవా సమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్, రంగనాయకులు, బాషా పాల్గొన్నారు.

కర్ర వంతెనతో పొంచి ఉన్న ముప్పు



ఆత్మకూరురూరల్: మండలంలోని బంట్లపల్లి వద్ద సోమశిల ఉత్తరకాలువపై వంతెన లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బంట్లపల్లితో పాటు పరిసర గ్రామాలైన ఖాన్‌సాహెబ్‌పేట, బసవరాజుపాళెం రైతులకు ఉత్తర కాలువకు ఇరువైపులా సాగు భూములు ఉన్నాయి. ఉత్తరకాలువపై వంతెన లేకపోవడంతో రైతులు సుమారు పది కిలో మీటర్లకుపైగా ప్రయాణించి పొలాల్లోకి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చేందుకు నానా పాట్లు పడుతున్నారు. దీంతో బంట్లపల్లి సమీపంలోని ఏరు వద్ద ఉత్తర కాలువపై నిర్మించిన కాంక్రీట్ గోడలపై తాత్కాలికంగా కర్రల వంతెనను ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెనపైనే జీవాల కాపరులు సైతం తమ జీవాలను నిత్యం మేతకు తోలుకెళ్తున్నారు. వంతెనపై జీవాలు రాకపోకలు సాగించే సమయంలో ఏ మాత్రం అదుపుతప్పిన ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఉత్తర కాలువ 4వ డివిజన్ అధికారులు స్పందించి వంతెనను నిర్మించాలని బాధితులు కోరుతున్నారు.

మంత్రి వస్తున్నారని...

- తూతూ మంత్రంగా గుంతలు పూడ్చివేత



కంకరతో తూతూ మంత్రంగా పూడ్చిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నుంచి సోమశిల రోడ్డు మలుపు వరకు రోడ్డు గుంతల మయంగా ఉంది. వర్షం వస్తే నీరు నిలిచి వాహనాలు వెళ్లే క్రమంలో పాదచారులపై ఎగిరి పడుతూ పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఈ మార్గంలోనే వెళ్లాలి. ప్రధాన రహదారి గుంతలమయంగా ఉన్నా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం అనంతసాగరం మండల పర్యటనకు రానుండడంతో మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా శని, ఆదివారాల్లో గుంతలను కంకరతో పూడ్చారు. ఇలా తూతూమంత్రంగా గుంతలను పూడ్చడంపై పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కంకర రాళ్లు ఎక్కడ లేచి వచ్చి తగులుతాయోనని పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.